www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 22 | డిసెంబర్ | 2025 పేజీలు : 8

# పెద్దాసుపత్రి కేంద్రంగా.. వికలాంగ నకిలీ ధృవపత్రాలు




**-ఒక్కో ధృవపత్రానికి రూ. 40వేల నుంచి రూ. 50వేలు**
**-అసలు వైకల్యం లేని వారికి 60 శాతం ధృవీకరణ**
**-జిల్లా వ్యాప్తంగా వసూళ్ల దందా**

**ప్రజాపక్షం/ఖమ్మం :** వికలాంగులకు నెల నెల రూ. 4,000 పింఛన్ ఇస్తుండడంతో దళారుల చూపు ఆ వైపు మళ్లింది. మీకు వికలాంగులకు ఇచ్చే ధృవీకరణ పత్రం ఇస్తాం నెలకు నాలుగు వేలు పింఛన్ వస్తుంది. మీకు వైకల్యం ఉన్నా లేకున్నా మాకు డబ్బులు ఇస్తే చాలు అంటూ ప్రచారం మొదలుపెట్టారు. ముందు వరుసలో రూ. 40వేల నుంచి రూ.50వేలు ముట్టజెప్పిన వారికి వికలాంగ ధృవీకరణ పత్రంతో పాటు పింఛన్ కూడా వస్తుండడంతో దళారుల పంట పండింది. పెద్ద సంఖ్యలో వైకల్యం లేనివారు వికలాంగ ధృవీకరణ కొరకు దళారులకు నగదు ముట్టజెప్పారు. వీరిలో చాలా మందికి ధృవీకరణ పత్రాలు రావడంతో ఈ ముఠా కార్యకలాపాలు జిల్లా వ్యాప్తమయ్యాయి. ఖమ్మం జిల్లాలోని నకిలీ ధృవపత్రాల జారీ ఖమ్మం పెద్దాసుపత్రి కేంద్రంగానే జరిగింది. గ్రామాల్లో ధృవపత్రాల కొరకు డబ్బులు సేకరించడం, వైరాలోని ఒక ఫోటో స్టూడియోలో అంగవైకల్యం కనపడే రీతిలో ఫోటోలు తీయించి దరఖాస్తు చేయించారు. అసలు వైకల్యం గల వారు సదరం కేంద్రాలకు వచ్చి ధృవీకరణ పత్రం కొరకు రోజుల తరబడి తిరగడంతో పాటు వైకల్యానికి సంబంధించి వైకల్య శాతం వాస్తవ పరిస్థితి కంటే తక్కువ వేశారని అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం దక్కడం లేదని వాపోతున్నారు. నకిలీ వికలాంగులు మాత్రం ఏ సదరం కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే వికలాంగ ధృవీకరణ పత్రాలు పింఛన్‌కు అర్హత పొందే రీతిలో ఇంటికి

మిగతా 3లో..

# సమస్యల నడుమ నేడు బాధ్యతల స్వీకరణ

**-సర్పంచ్‌ల ముందు పెను సవాళ్లు**
**-ఖమ్మంలో 566, భద్రాద్రిలో 469 పంచాయతీలు**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** సమస్యల నడుమ గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. మూడు విడతల్లో ఖమ్మం జిల్లాలో 566 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 469 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. 2024 జనవరితో గత సర్పంచ్‌ల పదవి కాలం ముగియగా అప్పటి నుంచి గ్రామ పంచాయతీలు ప్రత్యేకాధికారుల

మిగతా 2లో..

## ఏపూరి బ్రహ్మం సేవలు చిరస్మరణీయం
-హత్యలతో భావజాలాన్ని చంపలేరు
-బ్రహ్మం వర్ధంతి సభలో కూనంనేని

7లో

## యువతరమే దేశానికి రక్ష
-క్రమశిక్షణ, పోరాట పటిమకు మారుపేరు జనసేవా దళ్
-జనసేవాదళ్ శిక్షణ ప్రారంభ సభలో బాగం

3లో













# సమస్యల నడుమ నేడు బాధ్యతల స్వీకరణ

**(మొదటిపేజీ తరువాయి)**

పాలనలోనే ఉన్నాయి. అన్నింటికి మించి అతి కొద్ది శాతం మినహా అన్ని గ్రామ పంచాయతీలు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. పేరుకుపోయిన సమస్యలు ఒక పక్క, ఆర్థిక ఇబ్బందులు మరో పక్క పల్లెల్లో నెలకొన్న వేళ నూతన సర్పంచ్‌లు బాధ్యతలు స్వీకరించనున్నారు. గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలకు సంబంధించి పలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రతి గ్రామ పంచాయతీకి ఓ ట్రాక్టర్‌ను కేటాయించగా ఆ ట్రాక్టర్‌కు సంబంధించిన రుణం చెల్లించకపోవడం, ఆయిల్ బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో దాదాపు సగానికి పైగా పంచాయతీల్లో ట్రాక్టర్లు పని చేయడం లేదు. మొత్తంగా గ్రామ పంచాయతీలు ఒక విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటున్న వేళ నూతన సర్పంచ్‌లు బాధ్యతలు స్వీకరిస్తున్నారు. నూతన సర్పంచ్‌లు తమ సమస్యలను పరిష్కరిస్తారని గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు. ఎన్నికలు ముగిసినందున కేంద్ర ప్రభుత్వం నుంచి స్థానిక సంస్థలకు నిధులు విడుదలైతే తప్ప ప్రస్తుత గ్రామ పంచాయతీలలో పని చేసే పరిస్థితి లేదు. నూతనంగా ఎన్నికైన వారిలో అతి కొద్ది మంది మినహా ఎన్నికల్లో భారీగానే ఖర్చు చేశారు.

## సన్నాలకు బోనస్ జమ

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల రైతులకు ఖరీఫ్ సీజన్లో సన్నధాన్యం ప్రభుత్వానికి అమ్మిన రైతులందరికీ 4. 50 కోట్లు సుమారు పదివేల మందికి రైతులు ఖాతాలలో జమ అయినట్లు వ్యవసాయ శాఖ అధికారి రూప తెలిపారు. ఆరు లక్షల పైగా క్వింటాలు ధాన్యం కొనుగోలు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. నేరుగా ఖాతాలలో జమ కొనుగోలు కేంద్రాలలో విక్రయించిన రైతులు పౌరసరఫరాల శాఖ మార్కెటింగ్ ద్వారా నేరుగా ఖాతాలలో జమవుతున్నట్లు ఏవో తెలిపారు. ఇంకను కొనుగోలు చేస్తున్నట్లు పూర్తిస్థాయిలో మరో వారంలో బోనస్ ప్రోత్సాహం జమవుతున్నట్లు ఏవో పేర్కొన్నారు. వాతావరణంలో తేమ శాతం ఎక్కువగా ఉండటం వలన విక్రయాలు ఆలస్యం జరుగుతున్నట్లు పేర్కొన్నారు .మరో పది రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు పూర్తవుతాయని ఏవో తెలిపారు.

## మహాత్ముని పేరును ఉంచాలి



**ప్రజాపక్షం/కల్లూరు:** జాతీయ గ్రామీణ అభివృద్ధి పథకం కు మహాత్మా గాంధీ పేరును ఉంచాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు కోరారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు బట్టి ఉంచిన ఈ పథకం కు కుట్రపూరితమైన ప్రణాళిక చేపట్టి మహాత్మా గాంధీ పేరును తొలగించడం అన్యాయమని అన్నారు. మహనీయుల పేరు పథకానికి ఏమి అడ్డం వచ్చిందని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో దశల వారి ఆందోళన చేపట్టి మహాత్మా గాంధీ పేరు పెట్టే విధంగా నిరసన కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు రాంబాబు, పుల్లారావు, సందీప్, ధారా రంగ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహాత్మా గాంధీ పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

























# యువతరమే దేశానికి రక్ష

**-క్రమశిక్షణ, పోరాట పటిమకు మారుపేరు జనసేవా దళ్**
**-జనసేవాదళ్ శిక్షణ ప్రారంభ సభలో బాగం**





**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** యువతరమే దేశానికి రక్ష అని జనాభాలో సగ భాగం కలిగిన యువత అనుసరించే పంథా పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. దేశం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటున్న వేళ యువతరం చైతన్యవంతమైన ఆలోచనలతో సమాజ మార్పుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం ఏదులాపురంలో రెండవ దశ జనసేవాదళ్ శిక్షణా శిబిరాన్ని హేమంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ పతాకాన్ని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ ఆవిష్కరించారు. ప్రారంభ సభలో హేమంతరావు మాట్లాడుతూ జన సేవాదళ్ క్రమశిక్షణకు, పోరాట పటిమకు మారు పేరని ఆయన తెలిపారు. యువతలో రాజకీయ ఆలోనలు, క్రమశిక్షణ పెంపొందించేందుకు సిపిఐ అగ్రనేత, అమరజీవి చండ్ర రాజేశ్వరరావు జనసేవా దళ్‌కు శ్రీకారం చుట్టారన్నారు. ఆనాటి నుంచి కమ్యూనిస్టు పార్టీ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో యువతలో శారీరక ధృడత్వం, మానసిక పరివర్తన, సమాజం పట్ల అవగాహన పెంపొందించడానికి జన సేవాదళ్ కృషి చేస్తుందన్నారు. బిజెపి దేశాన్ని పెడ మార్గం వైపు నడిపిస్తుందని ప్రతి దానికి మతాన్ని ముడిపెడుతూ ప్రజలను మభ్యపెట్టే పని చేస్తుందన్నారు. యువత మాత్రమే బిజెపి భావజాలాన్ని అడ్డుకోగలదని అందుకు కృషి జరగాలన్నారు.

**100 ఏళ్ల ఉత్సవాన్ని జయప్రదం చేయండి..**

సిపిఐ 100 ఏళ్ల ఉత్సవాన్ని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ విజ్ఞప్తి చేశారు. జనవరి 18న జరిగే ప్రజా ప్రదర్శన, బహిరంగ సభకు యువతరాన్ని కదిలించాలని ఆయన కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 ఏళ్ల చరిత్రను నేటి తరానికి తెలియజేస్తూ గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహించాలని ప్రజలకు పార్టీ సందేశాన్ని అందజేసి యువకులను సమీకరించే వైపు కార్యాచరణ చేపట్టాలని సురేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల ఐలయ్య శిక్షకుడిగా వ్యవహరించగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడికంటి చిన్నవెంకటరెడ్డి, సిపిఐ నాయకులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, దండి రంగారావు, ఏఐవైఎఫ్ నాయకులు మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, గణపారపు ఉపేందర్, మామిడాల కిరణ్, రూరల్ మండల నాయకులు మిడికంటి పెద్ద వెంకట రెడ్డి, వెన్నం భాస్కర్, మామిడి శంకర్‌రెడ్డి, దొంతగాని వెంకన్న, గణపారపు వీరన్న, మామిళ్ల నిరంజన్‌రెడ్డి, పొన్నెకంటి రామకృష్ణ, దొంతగాని ఉపేందర్, వెంకటేష్, దండి రమేష్, మేళ్లచెరువు రవి, గురవయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

## నేడు సర్పంచ్‌ల బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీలకు నూతనంగా ఎన్నికైన పాలక వర్గ సభ్యులు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు మూడు విడతల్లో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించింది. మొదటి విడతలో రఘునాథపాలెం మండలంలో ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 37 గ్రామ పంచాయతీలలో ఐదు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన 32 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు బాధ్యతల స్వీకరణ నేడు చేపట్టనున్నారు. నూతన పాలక వర్గాల బాధ్యతల స్వీకరణ నేపథ్యంలో అన్ని గ్రామ పంచాయతీలను ముస్తాబు చేశారు. అవసరం ఉన్న వాటికి రంగులు వేయించారు. పలు గ్రామ పంచాయతీలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పంచాయతీ కార్యాలయంలో కావాల్సిన సౌకర్యాలను కల్పించారు. 22 నెలల తర్వాత గ్రామ పంచాయతీల్లో పాలక వర్గాలు కొలువుదీరనున్న నేపథ్యంలో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.







# పెద్దాసుపత్రి కేంద్రంగా.. వికలాంగ నకిలీ ధృవపత్రాలు






(మొదటిపేజీ తరువాయి)

చేరుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. వైరా, బోనకల్ మండలానికి చెందిన కొందరు వ్యక్తులు ఇతర మండలాలకు చెందిన మరి కొంత మందిని కలుపుకుని ఒక ముఠాగా ఏర్పడి పెద్ద మొత్తంలో వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. వికలాంగ ధృవీకరణ పత్రాలతో పింఛన్ కొరకు దరఖాస్తు చేయగానే గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు కనీస పరిశీలన చేయకుండానే మంజూరు చేస్తున్నారు. కనీస వైకల్యం లేని వారికి ఈ ధృవీకరణ పత్రం ఎలా వచ్చిందన్న కనీస పరిశీలన లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే వందలాది మందికి నకిలీ పత్రాలు జారీ కాగా ఇందులో ఖమ్మం పెద్దాసుపత్రిలోని ఒకరిద్దరు ఉద్యోగుల పాత్ర కీలకంగా ఉందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. సందట్లో సడేమియా అన్నట్లు కొందరు అధికార యంత్రాంగంతో సంబంధం లేకుండానే కొన్ని నకిలీ ధృవపత్రాలను తయారు చేసి పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. వందలాది మంది నకిలీ ధృవపత్రాలతో అసలు వైకల్యం లేని వారు ప్రతి నెల పింఛన్ పొందుతున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది. లంచాలకు అలవాటుపడి నకిలీ పత్రాలు జారీ చేసిన వారిపై విచారణ జరపడంతో పాటు నకిలీ వికలాంగ ధృవపత్రాలతో పింఛన్ పొందుతున్న వారిపై కేసులు నమోదు చేసి మొత్తం సొమ్మును రికవరీ చేయాలని నకిలీ ధృవపత్రాలు ఇప్పించే ముఠాను అదుపులోకి తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## లక్ష్మీపురం సర్పంచ్‌కు ఘన సన్మానం



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం లక్ష్మీపురం గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌గా గెలుపొందిన ఇనసనూరి అచ్చమ్మను తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్ ఆధ్వర్యంలో శాలవాతో సత్కరించి వార్డు మెంబర్స్‌కి లక్ష్మీపరం గ్రామ ప్రజలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, మల్లరం సర్పంచ్ కటికి కిరణ్‌కుమార్, లక్ష్మీపురం ఉపసర్పంచ్ బం డి బాలశౌరి, ఓబుల సీతారామిరెడ్డి, బాగం ప్రభాకర్, షేక్. జమాల్, పెద్ద సంఖ్యలో అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు..

## అన్నారుగూడెంలో బిఆర్ఎస్ విజయోత్సవ ర్యాలీ



**ప్రజాపక్షం/ తల్లాడ :** అన్నారుగూడెంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా గొడ్ల ప్రభాకర్ అఖండ విజయం సాధించిన సందర్భంగా ఆ పార్టీ శ్రేణులు, అత్యధిక మంది ప్రజానీకంతో కోలాట నృత్యాలతో డప్పువాయిద్యాలతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తల్లాడ మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు నేతృత్వంలో కనివిని ఎరగని రీతిలో ఈ మహార్యాలీలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ పరిసర ప్రాంత ప్రజలు బిఆర్ఎస్ కార్యకర్తలు, సండ్ర వెంకటవీరయ్య, అభిమానులు, దొడ్డ శ్రీనివాసరావు అనుచరులు అధికసంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# నేడు మాక్ డ్రిల్



**-ప్రయోగాత్మకంగా పకడ్బందీగా నిర్వహించాలి**
**-మాక్‌డ్రిల్ నిర్వహణపై అదనపు కలెక్టర్ సమీక్ష**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎలా ఎదుర్కొవాలి అనే అంశాలపై నేడు జిల్లా కేంద్రంలో ప్రయోగాత్మక రీతిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. వరదలు, పరిశ్రమల ప్రమాదాల మాక్ డ్రిల్ నిర్వహణపై ఆదివారం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విపత్తుల సంభవించిన సమయంలో ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు చేపట్టాల్సిన తక్షణ చర్యలపై సన్నద్ధతను పెంచేందుకు వీలుగా జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆదేశానుసారం మాక్ ఎక్సర్సైజ్ నిర్వహిస్తున్నామన్నారు. ఖమ్మం జిల్లాలోని రెండు ప్రదేశాల్లో మాక్ డ్రిల్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఖమ్మం బొక్కలగడ్డ ప్రాంత ప్రజలను రామ్‌లీల ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించడం, ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గ్రౌండ్ ఫ్లోర్ పేషంట్లను టాప్ ఫ్లోర్‌కు తరలించడం మాక్ ఎక్సర్సైజ్ గా చేపట్టనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో లై స్ట్రీమింగ్ చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. మాక్‌డ్రిల్‌లో భాగంగా వరదల కారణంగా బొక్కలగడ్డ మునిగిపోతుందని ఉదయం తొమ్మిది గంటలకు సమాచారం జిల్లా కంట్రోల్ రూముకు అందుతుందని ఆ సమాచారం రాగానే ఏ శాఖలను అలర్ట్ చేయాలి, క్షేత్రస్థాయిలో ఫీల్డ్ లెవల్ సహాయం వెంటనే ఎలా అందించాలి, ప్రజలను ఎలా త్వరగా ఖాళీ చేయించాలని వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన అదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు. మాక్ ఎక్సర్సైజ్‌లో భాగంగా విపత్తులు సంభవించినప్పుడు అందుబాటులో ఉన్న వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయడం, లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, లో లెవల్ వంతెనలు, కాజ్‌వేల గుండా రాకపోకలు నిషేధం, అంబులెన్స్, లైఫ్ బోట్‌లు, లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉండటం, రెస్క్యూ టీమ్, మెడికల్ టీమ్ ఏర్పాటు చేయాలన్నారు. మాక్ ఎక్సర్సైజ్‌లో భాగంగా 40 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, కొంత మందిని ఎత్తయిన బిల్డింగ్‌లకు తరలింపు, మరి కొంత మందిని పునరావాస కేంద్రానికి తరలించి ఆహారం, త్రాగునీరు, అవసరమైన వసతులు ఏర్పాటు చేయాలన్నారు. మాక్ ఎక్సైర్సైజ్‌ను పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి ఎ. శ్రీనివాస్, ఆర్అండ్‌బి ఎస్ఈ యాకోబ్, జిల్లా అగ్నిమాపక అధికారి అజయ్‌కుమార్, డిఎంఅండ్‌హెచ్‌వో డి. రామారావు, జిల్లా నీటిపారుదల అధికారి వెంకట్రామ్, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



# శత వసంతాల సభను జయప్రదం చేయండి

**-ఏఐవైఎఫ్ నూతన కమిటీ ఎన్నిక**
**-సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంలో జరగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వసంతాల ముగింపు సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం నగరంలోని కొత్తగూడెం సిపిఐ కార్యాలయంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) సమావేశం దుగ్యాల రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పడగాల మల్లేష్ మాట్లాడుతూ సిపిఐ బలోపేతం కోసం ఏఐవైఎఫ్ కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం యువత పోరాటాలు సాగించాలన్నారు. పాలకులు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. యువత చెడు మార్గం వైపు పయనించకుండా ప్రజా సమస్యల పరిష్కారం వైపు పయనించాలన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఖమ్మంలో జనవరి 18న జరిగే ముగింపు సభకు యువత, ప్రజలు భారీగా తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఏఐవైఎఫ్ కొత్తగూడెం శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తుపాకుల శ్రీకాంత్, కార్యదర్శిగా లింగం సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భూమా ఉపేందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కర్రి రాకేష్, ఉపాధ్యక్షులుగా నలుగురిని , సహాయ కార్యదర్శులుగా నలుగురు మొత్తం 25 మందితో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాకదాని రాజు, యూత్ నాయకులు తోట నాగరాజు, పగడాల చంద్రశేఖర్, తుపాకుల నవీన్, నిడిగొండ మహేష్, దంతాల నాగరాజు, సైదులు, గొడుగు మధు, ముద్రబోయిన రాంబాబు, ఎస్‌కె మైబు, భూమా మహేష్, గండికోట రవీందర్, నాగటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అధిక దిగుబడినిస్తున్న 1262 వరి రకం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** వరి సాగు అంత లాభదాయకం కాదన్న భావన రైతాంగంలో ఉంది. అంత నష్టం కూడా రాదని కాకపోతే ఈ మధ్య తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాలు, అననుకూల వాతావరణ పరిస్థితులు దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ముఖ్యంగా దోమ, తెల్లాకు, రేళ్లకొట్టుడుతో తీవ్రంగా రైతులు నష్టపోతున్నారు. అయితే వీటిని అధిగమించి మంచి అధిక దిగుబడిని ఇస్తున్న రకం ఎంటియు 1262 రకం. మారిటేరు వ్యవసాయ వరి పరిశోధన కేంద్రం నుంచి తయారైన ఈ రకం పంట కాలమితి మిగిలిన రకాల కంటే 20 నుంచి 25 రోజులు ఆలస్యమవుతుంది. కానీ ఎంటియు 1262 రకం వరికి దోమపోటు వచ్చే అవకాశం లేదని సాగు చేసిన రైతులు అంటున్నారు. ముఖ్యంగా అకాల వర్షాలు వరి రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. గాలికి పైరు పడిపోవడం, గింజ రాలి పోవడం జరుగుతుంది. ఎంటియు 1262 రకం వరికి పోటు ఆకు మందంగా, ఎత్తుగా ఉండడంతో కిందపడే అవకాశం లేదని, గింజ రాలే అవకాశం లేదని రైతులు తెలిపారు. అధిక దిగుబడి ఇవ్వడంతో పాటు రోగాలను తట్టుకునే ఎంటియు 1262 వరి రకాన్ని సాగు చేయవచ్చునని ఈ ఏడాది సాగు చేసిన రైతులు తెలిపారు.

**రోగాలను తట్టుకుంటుంది...**



ఎంటియు 1262 వరి రకం రోగాలను తట్టుకుని అధిక దిగుబడిని ఇస్తుందని మధిర మండలం మల్లవరం గ్రామానికి చెందిన రైతు కొంగర మురళికృష్ణ తెలిపారు. ఆయన రెండేళ్లుగా మూడు ఎకరాలలో ఎంటియు 1262 వరి రకాన్ని సాగు చేస్తున్నాడు. దుబ్బు ఎక్కువగా చేస్తుందని 30 నుంచి 40 పిలకలు రావడంతో పాటు మొక్క ధృడంగా ఉంటుందని మురళికృష్ణ తెలిపారు. తుఫాన్లు, ఈదురు గాలులకు పడిపోదని కాకపోతే పంట కాస్త ఆలస్యంగా వస్తుందని ఎంటియు 1262 రకాన్ని రైతులు సాగు చేసి అధిక దిగుబడులు పొందవచ్చునని మురళికృష్ణ తెలిపారు.

# స్వాతంత్ర్య సమరయోధురాలు చావా సుగుణమ్మ మృతి



**ప్రజాపక్షం/ఖమ్మం :** స్వాతంత్ర్య సమరయోధురాలు, కమ్యూనిస్టు పార్టీ ప్రముఖ నాయకుడు చావా వెంకటేశ్వరరావు సతీమణి చావా సుగుణమ్మ (90) ఆదివారం ఖమ్మం నెహ్రూనగర్‌లోని వారి స్వగృహంలో మృతిచెందారు. ఆమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె కుమారుడు వేణు తిరుమలాయపాలెం సహకార సంఘం అధ్యక్షునిగా పనిచేస్తున్నారు. ఆమె మృతివార్త తెలిసిన వెంటనే సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి తదితరులు మృతదేహంపై అరుణపతాకాన్ని ఉంచి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం నాయకురాలు బుగ్గవీటి సరళ, సిపిఐ నాయకులు చావా వెంకట్రావు తదితరులు ఉన్నారు. ఆమె అంత్యక్రియలు సోమవారం తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణిలో ఉదయం 11 గంటలకు జరుగుతాయని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

# మృతుని కుటుంబానికి బియ్యం వితరణ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఇటీవల మృతి చెందిన చిమ్మపుడి గ్రామానికి చెందిన వాడపల్లి సుందరమ్మ కుటుంబాన్ని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వర్లు పరామర్శించి 50 కేజీల బియ్యాన్ని ఆదివారం వితరణగా అందించారు. గత ఎనిమిది సంవత్సరాలుగా కుల, మత రాజకీయాలకు అతీతంగా సేవ చేస్తున్న గుత్తా వెంకటేశ్వర్లు గ్రామంలో నిరుపేద కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే 50 కేజీల బియ్యాన్ని అందిస్తున్నారు. సుందరమ్మ కుటుంబాన్ని గుత్తా వెంకటేశ్వర్లు తో పాటు వార్డు సభ్యురాలైన గుత్తా చంద్రకళ దంపతులు పరామర్శించి బియ్యాన్ని వితరణగా అందించారు. ఈ సందర్భంగా గుత్తా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామంలో తన వంతు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గుండ్ల ముత్తయ్య, దేశగాని నర్సయ్య, దంతాల వెంకటేష్, మాజీ వార్డు సభ్యులు కాళంగి వీరబాబు, మద్దుల నాగేశ్వరరావు, స్థానికులు సూరంశెట్టి ఉపేందర్, పోతురాజు సంగయ్య తదితరులు ఉన్నారు.

# ఖమ్మంకు మణిహారంగా శిల్పారామం

**-5.04 ఎకరాల భూమి కేటాయింపు**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరానికి మరో మణిహారంగా శిల్పారామం నిలవనుంది. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో ఖమ్మం నగర అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. సాంస్కృతిక, వారసత్వాన్ని పరిరక్షిస్తూ సాంప్రదాయ కళలకు ప్రోత్సహం కల్పించేందుకు శిల్పారామం నిర్మాణం చేపట్టాలని తలంచి ఇందు కోసం ప్రభుత్వం 5.4 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించింది. శిల్పారామం నిర్మాణం ద్వారా స్థానిక కళాకారులు, శిల్పులు, హస్తకళాకారులకు ఒక శాశ్వత వేదిక లభించనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు సంస్కృతి, సాంప్రదాయ కళలు, జానపద కళారూపాలు దగ్గరయ్యేలా ఇది రూపుదిద్దుకోనుంది. పర్యాటకంగా అభివృద్ధి చేయడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరగనున్నాయి. శిల్పారామం ప్రాంగణానికి ఆకర్షణీయంగా శిల్పకళ విలువలను ప్రతిభింభించేలా ముఖ ద్వారం నమూనా చిత్రం (ఎంట్రన్స్ గేట్ డిజైన్) సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. భూమి కేటాయింపు ప్రక్రియను కూడా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ నిర్మాణం పూర్తయితే రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా ఒక సాంస్కృతిక కేంద్రంగా గుర్తింపు పొందనుంది. శిల్పారామం ఏర్పాట్లు పట్ల నగర ప్రజలు, కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# విజయవంతమైన మెగా లోక్ అదాలత్




**ప్రజాపక్షం/ మధిర :** మధిర కోర్టులో ఆదివారం జరిగిన మెగా లోక్ అదాలత్ విజయవంతమైంది. ఈ మెగా లోక్ అదాలత్‌లో 1587 కేసులు పరిష్కారమయ్యాయని, రూ.5,25,000 జరిమానా విధించినట్లు న్యాయమూర్తి దీప్తి వేముల తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లు న్యాయవ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ప్రజలు కోర్టుల చుట్టూ తిరగకుండా తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో పరస్పర అంగీకారంతో వివాదాలను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌ల ఎంతో ఉపకరిస్తాయని మెగా లోక్ అదాలత్ ద్వారా పాత కేసులు స్నేహపూర్వకంగా పరిష్కారమవడంతో కోర్టులపై భారం తగ్గడమే కాకుండా ప్రజల్లో న్యాయ వ్యవస్థపై నమ్మకం మరింత పెరుగుతోందని అని తెలిపారు. ఈ మెగా లోక్ అదాలత్ 1587 కేసులు పరిష్కరించబడి వాటి ద్వారా రూ.5,25,000 జరిమానా విధించటం జరిగిందని న్యాయమూర్తి వెల్లడించారు. అదేవిధంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు న్యాయమూర్తి సమయ స్ఫూర్తితో పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపూరి బ్రహ్మం సేవలు చిరస్మరణీయం



**-హత్యలతో భావజాలాన్ని చంపలేరు**
**-బ్రహ్మం వర్ధంతి సభలో కూనంనేని**



**ప్రజాపక్షం/ఇల్లందు:** నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు నిలబడిన అసలైన కమ్యూనిస్టు ఏపూరి బ్రహ్మం అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనం నేని సాంబశివరావు అన్నారు. ఆదివారం ఇల్లందు పట్టణం లోని జెకె కాలనీ వద్ద ఏపూరి బ్రహ్మం మొదటి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన స్థూప ఆవిష్కరణ కార్యక్రమం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే సారయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ ఇల్లందు ప్రాంతంలో ఏపూరి బ్రహ్మం పట్టుదల, ప్రేమ, పోరాట పటిమ కలిగిన నాయకుడని తన చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతం పట్ల నిబద్ధతతో పని చేశారని తెలిపారు. కమ్యూనిస్టు అనే వాడు ఒక్కడు ఉన్నా సరే నిజాయితీగా ఉండి ఆ పార్టీ కృషికి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని తెలిపారు. కమ్యూనిస్టుల పట్ల అభిమానం, విశ్వసనీయత ఉన్న దానిని మనం ఓట్లగా మల్చలేకపోతున్నామని అన్నారు. కార్మిక వర్గానికి అండగా ఉన్నది కమ్యూనిస్టులు మాత్రమేనని, నాడు సంఘటిత రంగంలో కార్మికులు, నేడు అసంఘటిత రంగ కార్మికులుగా మారారని వారి అభిరుచికి తగ్గట్టుగా కమ్యూనిస్టులు మారి వారిని కమ్యూనిజం వైపు నడిపించాలన్నారు. 2026 మార్చి 31 వరకు మావోయిస్టులందరిని అంతం చేస్తానని ప్రకటించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా మావోయిస్టులను మాత్రమే చంపగలడని ప్రజల గుండెల్లో ఉన్న వారి మావోయిజం చంపలేడన్నారు. కమ్యూనిస్టు పార్టీలు నిరంతరం ప్రజా సమస్యలపై పోరాట చేస్తూ కమ్యూనిస్టు ఉనికిని కాపాడుకోవాలన్నారు. దేశంలో కమ్యూనిస్టులు మాత్రమే పేద ప్రజల కోసం పోరాడి వారి హక్కులను కాపాడారని ఆదర్శ కమ్యూనిస్టులు పోరాట చరిత్ర భావితరాలకు తెలియాలన్నారు. ప్రస్తుతం భారతదేశంలో బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని, దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతుందని, దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ బడా పారిశ్రామిక వేత్తలకు అప్పగించి కార్మికులను మోసం చేస్తుందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకుండా రైతులకు ఇబ్బందులకు గురి చేస్తుందని, రైతులకు యూరియా సరైన సమయానికి అందించకుండా ఎన్నో ఇబ్బందులకు గురి చేసిందన్నారు. రానున్న రోజుల్లో బిజెపి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని విమర్శించారు. ఈకార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయ పార్థసారథి, రాష్ట్ర నాయకులు పోటు కళావతి, ఏపూరి లతాదేవి, ముత్యాల విశ్వనాథం, తాటి వెంకటేశ్వరరావు, సింగు నరసింహారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, మండల పట్టణ కార్యదర్శులు బొప్పిశెట్టి సత్యనారాయణ, బాస శ్రీనివాసరావు, ఏఐటియూసి బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, ఉపాధ్యక్షులు దాసరి రాజారాం, మండల కార్యదర్శిలు, సిపిఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





# ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మార్కెట్ యార్డ్ పరిధిలో మెప్మా, పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను ఆదివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు పరిశీలించారు. అనంతరం ఆయనమాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులు పండించిన పంటలకు గిట్టుటు ధరతో పాటు సన్న ధాన్యానికి కింటా ఒక్కంటికి రూ.500 రూపాయలు బోనస్‌గా ఇవ్వటం ధాన్యం రైతులు మొహాల్లో ఆనందాన్ని నింపిందని తెలిపారు. గత మూడు రోజులు క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క బోనస్ నిధులును సంబంధిత శాఖ సివిల సప్లయి డిపార్మెంట్ ద్వారా రైతులు ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అద్దంకి రవికుమార్, బాణావత్ రమణానాయక్, కాంగ్రెస్ నాయకులు కర్నాటి రామారావు, ఆవుల కిరణ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ గోపాలరావు, షేక్.జానిబాష, రైతులు పాల్గొన్నారు.

# జాతీయలోక్ అదాలత్‌కు విశేష స్పందన

**- 3054 కేసులు పరిష్కారం : సిపి సునిల్‌దత్**

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వాహించిన జాతీయలోక్ అదాలత్‌కు విశేష స్పందన వచ్చిందని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ తెలిపారు. ఈ అదాలత్‌లో మొత్తం 3054 కేసులు పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు. 63 సైబర్ క్రైం కేసుల్లో 35లక్షల రూపాయలకు పైగా రిఫండ్ మొత్తాన్ని బాధితులకు అందజేసినట్లు తెలిపారు. రాజీకి అవకాశం ఉండి పరిష్కరించిన 3054 కేసుల్లో ఎఫ్ఐఆర్ కేసులు 478, ఈ పిటి కేసులు 947, డ్రంకెన్‌డ్రైవ్ కేసులు 1629, సైబర్ కేసులు 63 పరిష్కరించడం ద్వారా రూ.35,11,026/ బాధితులకు అందజేసినట్లు పేర్కొన్నారు. రాజీమార్గం రాజమార్గమని, లోక్‌అదాలత్ ద్వారా ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందని అవగాహర కల్పించి కేసుల పరిష్కారానికి కృషిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని పోలీసు కమిషనర్ అభినందించారు. అదేవిధంగా లోక్ అదాలత్‌ను సద్వినియోగానికి సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయసేవాధికారులకు కృతజ్ఞాతలు తెలిపారు.

# పద్మ భౌతికకాయానికి నివాళి



**ప్రజాపక్షం/కూసుమంచి:** నేలకొండపల్లి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్, కొండపల్లి సురేష్ తల్లి కొండపర్తి పద్మ అనారోగ్య కారణంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని వారి స్వగ్రామం చేగొమ్మ చేరుకొని పద్మ భౌతికాయానికి నేలకొండపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎన్నె పూసల సీతారాములు, పాలేరు ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయం ఇన్చార్జి భీమ్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కంచర్ల జీవన్‌రెడ్డి, చాట్ల పరశురాం, శేఖర్‌రెడ్డి, సురభి నాయక్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయాలి




**పశ్చిమ బెంగాల్ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ వెంకటేశ్వరరావు**

**ప్రజాపక్షం/కల్లూరు:** విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయాలని పశ్చిమబెంగాల్ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ వెంకటేశ్వరరావు అన్నారు. తెలంగాణ గ్రామ స్కూల్ పదవ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక శక్తిని గుర్తించాలని ఈ విషయంలో తల్లిదండ్రులు ఎక్కువ శ్రద్ధ చూపాలని తల్లిదండ్రులను కోరారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధించిన అంశాలనే కాక తల్లి దండ్రులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని డాక్టర్ మల్లేశ్వరరావు సూచించారు. తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులను అయినప్పటికీ తల్లిదండ్రులు బాధ్యత ఎంతో ఉన్నతంగా ఉండాలని అన్నారు. అనంతరం పాఠశాలలో చదివి ఎంబిబిఎస్ ఎంబీఏ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు సన్మానించారు. ఈ ప్రాంతానికి చెందిన ఐఏఎస్ అధికారిగా పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో కలకత్తాలో విద్యుత్ నియంత్రణ మండలి చైర్పర్సన్ గా కొనసాగుతున్న అతనిని ఆనాటి పూర్వ విద్యార్థులు స్నేహితులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ పసుమర్తి చంద్రరావు జాయింట్ కార్యదర్శి కేశవరావు ఈసీ మెంబర్లు ఎస్కే జావేద్, ఎండి ఆయూబ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

# జీవన్ ఆస్పత్రిలో ముగిసిన క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ టెస్ట్



**ప్రజాపక్షం/భద్రాచలం:** పట్టణంలోని జీవన్ ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు ముగిశాయి. ఈ పరీక్ష చేయించుకునేందుకు భద్రాచలం పట్టణంతో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాలకు చెందిన సుమారు 200మందికిపైగా మహిళలు తరలివచ్చారు. సికింద్రాబాద్‌కు చెందిన యశోధ ఆస్పత్రి రేడియోషన్ అంకాలజిస్టు డాక్టర్ టి స్రవంతిరెడ్డి మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మహిళలకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఈసందర్భంగా జీవన్ ఆస్పత్రి మహిళా వైద్యనిపుణులు డాక్టర్ చల్లగుళ్ల స్పందన మాట్లాడుతూ మారుతున్న ప్రస్తుత పరిస్థితులు ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, ఆహారపు అలవాట్లతో పాటు వాతావరణంలోని బ్యాక్టీరియాలతో మహిళలు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మహిళల్లో ప్రస్తుతం అనేక రకాల క్యాన్సర్ కారకాలు కనిపిస్తున్నాయని వాటిని ఇలాంటి స్క్రీనింగ్ టెస్టుల ద్వారా ముందుగానే తెలుసుకుంటే నివారణ సులభతరం అవుతుందన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులచే పరీక్షలు చేయించుకోవడం ఎంతో మేలని, వారందించే అనుభవపూర్వక సలహాలు, సూచనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మహిళలు ప్రధానంగా వ్యక్తిగత ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, బలవర్ధకమైన పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలని, బరువు తగినన్ని నీళ్లు, సరిపడా నిద్ర పోవాలన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం ఆనందంగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో ఆస్పత్రి నిర్వాహకులు చల్లగుళ్ల నాగేశ్వరరావుతో పాటు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇంకెన్నాళ్లు దళితులపై అత్యాచారాలు






**-అత్యాచారానికి యత్నించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి**

**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురంలోని దళిత మహిళపై అత్యాచారం చేసేందుకు యత్నించిన జర్నలిస్ట్ అశ్వాపురం మండలం సూర్య రిపోర్టర్ నెహ్రూపై చట్టపరమైన చర్యలు తీసుకుని శిక్షపడే విధంగా చేయాలని ఇలాంటి ఘటనలను పునరావృతం కాకుండా పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసంపల్లి కృష్ణ అన్నారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో మారుమూల ప్రాంతాల్లో కూడా దళిత మహిళలపై అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని దేశంలో వీటిపై కఠిన శిక్షలు వేస్తున్న కూడా ఇలాంటి ఘటనలు జరగకుండా ఆగడం లేదని ఇలాంటి బాధితులపై న్యాయస్థానం కఠిన శిక్షలు వేయాలని కోరారు. సమాజానికి ఆదర్శంగా ఉండాలని అన్నారు. మండలంలో జరిగిన ఈ ఘటన విషయంలో సూర్య రిపోర్టర్ నెహ్రూపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత మహిళకు అండగా ఉంటామన్నారు. బాధితురాలికి జరిగిన అన్యాయంపై ఇచ్చిన ఫిర్యాదును వెంటనే తీసుకొని అత్యాచార యత్న వ్యక్తిపై కేసు నమోదు చేసిన అశ్వాపురం సిఐ అశోక్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని మండలంలో లా అండ్ ఆర్డర్‌ను పటిష్టంగా నడిపిస్తున్న పోలీసులకు మండల ప్రజలు అన్ని సంఘాలు సహకరిస్తాయని అన్నారు. ఇట్టి కేసును తప్పు దోవ పట్టించే విధంగా ఎవరు ప్రయత్నించిన దళిత సంఘాలతో ఏకమై బాధితురాలికి న్యాయం జరిగి, నెహ్రూకి శిక్ష పడేంత వరకు పోరాడుతామని, దళితులకు అణగారిని వర్గాలకు ఏదిజరిగిన ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందని అన్నారు.

# గ్రంథాలయం నాలెడ్జ్ పెంపుదలకు నిలయం

**-డాక్టర్ కాపా మురళీకృష్ణ**
**-మాదినేని సునీత పుట్టినరోజు సందర్భంగా పలు కార్యక్రమాలు**





**ప్రజాపక్షం/వైరా:** సమాజంలో మార్పు తీసుకురావడానికి పుస్తక పఠనం ఒక శక్తివంతమైన ఆయుధమని ప్రతి ఇల్లు ఒక గ్రంధాలయంగా మారాలని ఫాస్ట్ జిల్లా గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ ఆకాంక్షించారు. వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షులు వై.బుచ్చిరామారావు ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ మహిళా కోఆర్డినేటర్ మాదినేని సునీత జన్మదిన వేడుకలు ఆదివారం వైరాలో ఘనంగా శాఖ గ్రంధాలయంలో నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా వరసిద్ధి వినాయక మందిరంలో గోవులకు తౌడును 12వ వార్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకి ఆట వస్తువులను శాఖ గ్రంధాలయంలో కాంపిటేషన్ ఎగ్జామ్స్ ప్రిపేర్ అవుతున్న విద్యార్థిని, విద్యార్థులకు రీడింగ్ ప్యాడ్స్‌ను ఈ సందర్భంగా అందించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత అధునాతన సాంకేతికత సోషల్ మీడియా యుగంలో ప్రస్తుత విద్య వ్యవస్థ కేవలం మార్కులు ర్యాంకులు చుట్టూనే తిరుగుతుందని ఇది మనిషిని సంస్కరించలేకపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నాటితరం ఆలోచన విధానం విలువలు నేడు కల్తీ కేవలం ఉద్యోగం సంపాదన ధోరణిలో పడి మానవజన్మ సార్ధకతను మరిచిపోతున్నారని మురళీకృష్ణ తెలిపారు. మరల పాతకాలపు సంస్కారం మళ్లీ రావాలంటే గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు పుస్తకాలు చదవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఇచ్చే సంతృప్తి తాత్కాలికమైందని, పుస్తకాల ద్వారా లభించే జ్ఞానం మాత్రమే శాశ్వతం అని పేర్కొన్నారు. మాదినేని సునీత తమ పుట్టినరోజున వివిధ సేవా కార్యక్రమాలు చేయడం సమాజానికి ఉపయోగపడే విధంగా గ్రంధాలయానికి చదువుకు అవసరమైన రీడింగ్ ప్యాడ్స్‌ను విరాళంగా అందించిన సేవా కార్యక్రం ఎంతో అభినందనీయమని ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించి జ్ఞాన వికాసానికి బలమైన పునాదిని వేస్తాయని మీ సేవా భావం సామాజిక బాధ్యత మరెందరకు ఆదర్శంగా నిలవాలని మీ జీవితం ఎల్లప్పుడూ ఆరోగ్యం ఆనందం విజయాలతో నిండిపోవాలని తెలిపారు. అనంతరం కేక్ కటింగ్ చేసి సభ్యులందరూ సునీతకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సునీత మాట్లాడుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్‌రావు, జిల్లా విజన్ కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్ బాబు, క్లబ్ సెక్రటరీ చెరుకూరి శ్రీనివాసరావు, లయన్స్‌క్లబ్ సభ్యులు గజ్జల కృష్ణమూర్తి, నూకల ప్రసాదరావు, నూకల శ్రీనివాసరావు, కొల్లా రాంబాబు, మాదినేని దుర్గాప్రసాద్, రంగా సత్యనారాయణ, నల్లమోతు లక్ష్మీ నారాయణ, మాదినేని లక్ష్మ ణరావు, పుప్పాల అనంతరామయ్య, సరిపుడి రాము, గ్రంధ పాలకులు రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగిన లారీని ఢీకొట్టిన ఆర్టిసి బస్సు

**- బస్సులో ఉన్న 35మందికి గాయాలు**
**- లారీ క్లీనర్ మృతి**
**- తృటిలో తప్పిన పెను ప్రమాదం**





**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** ఆగిన లారీని వెనుక భాగంలో ఆర్టిసి బస్సు ఢీకొన్న పెను ప్రమాదం తృటిలో తప్పిందని ఖమ్మం రూరల్ ఎసిపి తిరుపతిరెడ్డి అన్నారు. ఖమ్మం నుండి వరంగల్ వైపు వెళ్తున్న దిగుమతి చేసుకున్న లారీ చంద్రుతండా స్టేజి సమీపంలో లారీ డ్రైవర్ జైశ్రీ ప్రసాద్ క్లీనర్ నితీష్‌కుమార్ ఆపి లారీ కింద ఉన్న జాయింట్ బోల్టులను బిగిస్తున్న క్రమంలో ఒంగోలు నుంచి నిజాంబాద్ జిల్లాకు ప్రయాణీకులతో వెళ్తున్న బోధన డిపోకు చెందిన సూపర్ డీలక్స్ టిఎస్ ఆర్‌టిసి బస్సు వెనుక నుండి అతివేగంగా ఢీకొనడంతో లారీ కింద ఉన్న క్లీనర్ పై నుండి లారీ టైర్లు ఒకేసారి వెళ్లగా క్లీనర్ నితీష్‌కుమార్(22) తీవ్ర గాయాలు కాగా సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్సై కూచిపూడి జగదీష్ క్షతగాత్రులను చికిత్స నిమిత్తమ ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ లారీ క్లీనర్ నితీష్‌కుమార్ మృతి చెందాడు. బస్సులో ప్రయాణీస్తున్న సుమారు 32 మందికి స్వల్ప గాయాలుగా అందరిని 108 వాహనం ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని ఖమ్మం రూరల్ ఎసిపి తిరుపతిరెడ్డి పరిశీలించి మృతి చెందిన లారీ క్లీనర్ నితీష్‌కుమార్ డ్రైవర్ జైశ్రీప్రసాద్‌ల ఇద్దరు స్వస్థలం బీహార్ రాష్ట్రం కాగా వారి సమాచారాన్ని తెలుసుకుని లారీ ఓనర్‌కి బాధితుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని తెలిపారు. బస్సులో ప్రయాణిస్తున్న 32మంది ప్రయాణీకుల ఆచూకి తెలుసుకుని వారి కుటుంబాలకు సమాచారం ఇచ్చామని, ఎప్పటికప్పుడు క్షతగాత్రుల వివరాలు కుటుంబసభ్యులకు తెలియచేశామని వివరించారు. శనివారం అర్ధరాత్రి 12గంటల సమయంలో గాడ నిద్రలో ఉన్న ప్రయాణీకులు బస్సు ప్రమాదంలో ఉలిక్కపడ్డారని, వెంటనే స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయ సహకారాలు అందించిన స్థానిక పోలీసులకు ఎంతో రుణపడి ఉంటామని ప్రయాణీకులు తెలిపారని వారు తెలిపారు.

## ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు





**ప్రజాపక్షం/వైరా:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైరాలో ఘనంగా నిర్వహించారు. రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద వైఎస్.జగన్ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి కేక్ కట్ చేశారు. వైరా పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరి ప్రశాంత్, షేక్ లైక్‌ఉద్దీన్, ఓర్సు కోటేశ్వరరావు, షేక్ యూసఫ్, షేక్ సాదిక్, దరావత్ రవి, షేక్ ఆశ్రిఫ్, పరస రామకృష్ణ, దార్న వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.










